తండాలకు వెళ్లాలంటే తండ్లాటే

- అధ్వానంగా మారిన రోడ్లు
- వర్షం పడితే రాకపోకలకు అంతరాయం
- అవస్థలు పడుతున్న గిరిజనులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మారుమూల తండాలకు రాకపోకలు సాగించాలంటే నిత్యం తంటాలు పడాల్సిందేనని గిరిజనులు వాపోతున్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినా వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు మాత్రం ఎలాంటి చొరవ చూపడం లేదు. తండాలకు కనీసం సౌకర్యాల కోసం మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడంలో పాలకులు విఫలమయ్యారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే తండాలకు వెళ్లే రోడ్లు బురదమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పలు తండాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా మట్టిరోడ్లే దిక్కు..

మండలంలోని కొన్ని తండాలకు ఇప్పటికీ మట్టి రోడ్లు మాత్రమే ఉండడంతో ప్రతీ ఏటా రోడ్లు భారీ వర్షానికి కొట్టుకుపోయి నడవడానికి సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా తండాల గిరిజనులు పేర్కొంటున్నారు. లింగంపేట మండలంలోని కొట్టాల్‌గడ్డ తండా, పొల్కంపేట తండా, సురాయిపల్లి తండా, ఎర్రోళ్ల తండా, తుల్జానాయక్ తండా, గట్టుమైసమ్మ తండా, రాంపల్లి తండా, శెట్పల్లి తండా, బోనాల్ తండా, చింతల్ గుట్ట తండా, లక్ష్మన్‌నాయక్ తండాతో పాటు పలు తండాలకు మట్టి రోడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే గిరిజనులు రోడ్లపై నడవాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద రోడ్ల కారణంగా తండాలకు అధికారులు రావడానికే ఇష్టపడడంలేదని వాపోతున్నారు. అధికారులకు, పాలకులకు పలుమార్లు బీటీ రోడ్లు వేయాలని మొరపెట్టుకున్నా ఫలితం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మండలంలోని తండాలకు బీటీ రోడ్లు వేసి, సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.




బురదమయంగా మారిన సురాయిపల్లి తండాకు వెళ్లే మట్టి రోడ్డు.. కొట్టాలగడ్డ తండా రోడ్డు



గట్టుమైసమ్మ తండా రోడ్డు

తండాకు వాహనాలు రావడంలేదు..



తండా నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రావాలంటే మూడు కిలో మీటర్లు నడవాలి. సురాయిపల్లి నుంచి తండాకు వెళ్లే రోడ్డు బురదమయమై అధ్వానంగా మారింది. మండల కేంద్రం లింగంపేట, జిల్లా కేంద్రం కామారెడ్డి నుంచి సరుకులు తెచ్చుకోవాలంటే తండాకు ఎలాంటి వాహనాలు రావడానికి ఇష్టపడడంలేదు. రోడ్డుపై నడవాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–మెగావత్ హీరామాన్, కొట్టాల్‌గడ్డ తండా

బడులకు వెళ్లాలంటే కష్టంగా మారింది..



ఒంటర్‌పల్లి నుంచి గట్టుమైసమ్మ తండా వరకు పంట చేనుల నుంచి రోడ్డు ఇరుకుగా ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఉంటుంది. తండాలో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పైతరగతులకు వెళ్లాలంటే మండల కేంద్రానికి వెళ్లాలి. వర్షం పడితే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం మానుకోవాల్సిందే. అధికారులు, పాలకులకు పలు మార్లు రోడ్డు వేయాలని మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.

– కెతావత్ రాంసింగ్, గట్టుమైసమ్మ తండా

బీసీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం




కామారెడ్డిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. నాగిరెడ్డిపేటలో...

లింగంపేట/బీబీపేట/నాగిరెడ్డిపేట/కామారెడ్డి టౌన్: బీసీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదంతో పంచాయతీ రాజ్ చట్టం 2018కి సవరణ చేయాలని, త్వరలో ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించడం చారిత్రాత్మకం అన్నారు. ఈసందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటు పలు మండలాల్లో సీఎం రేవంత్, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. లింగంపేటలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. బీబీపేటలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు నాగిరెడ్డిపేట కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాంగౌడ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



బీబీపేటలో..

రిజర్వేషన్లపై రాజకీయం చెయొద్దు

కామారెడ్డి అర్బన్: బీసీ డిక్లరేషన్ హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై క్యాబినెట్ ఆమోదించడం స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం స్థానిక ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై ప్రతిపక్షాలు రాజకీయం చేయకుండా తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, నాయకులు నాగరాజ్‌గౌడ్, మోహనాచారి, నారాయణరావు, కొత్తపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డిలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

క్లుప్తంగా

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నస్రుల్లాబాద్: ప్రతి విద్యార్థిపై పాఠశాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుర్కి గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి, ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయినులు దుర్గ తదితరులు ఉన్నారు.

కామారెడ్డిలో వైద్య శిబిరం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని బతుకమ్మ కుంట ఉర్దూభవన్‌లో శనివారం కామారెడ్డి, వివేకానంద, రామాయంపేట స్నేహబంధు, సదాశివనగర్ లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంతో మెడిసిటీ ఆస్పత్రి సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 530 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 50 మందికి వివిధ ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. లయన్స్ క్లబ్ క్యాబినెట్ అడిషనల్ జాయింట్ కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, డిస్ట్రిక్ చైర్మన్ దామోదర్, ప్రతినిధులు బాలరాజు, హన్మంతురావు, బొంది రమేష్, మచ్చ గంగాధర్, నర్సారెడ్డి, కమలాకర్‌రావు, ముదాం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించి, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల లింగం, చింతల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు ప్రకాష్, నారాయణ, నరేందర్, కృష్ణ, నాయకులు రాజశేకర్, కృష్ణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, బాబయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



రామారెడ్డి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు సత్తా చాటాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన సురేందర్‌ను శనివారం రామారెడ్డి మండల బీఆర్‌ఎస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని శ్రేణులకు సూచించారు. రామారెడ్డి మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు గురజాల నారాయణ రెడ్డి, నాయకులు తుపాకుల రాజేందర్‌గౌడ్, పాల మల్లేశ్, రాజయ్య, లింగం, మల్లయ్య, మర్రి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ధర్మ టీచర్స్ యూనియన్(డీటీయూ) నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, కార్యదర్శి హరికిషన్, ఉపాధ్యక్షుడు అశోక్‌లు హాజరై నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా జ్యోతి, కార్యదర్శులుగా ఉపాసన, దేవందర్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్‌గౌడ్, స్వామి, గంగారాం, రాజన్న, గౌరవ అధ్యక్షుడిగా శివప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తదితరులున్నారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి: పట్టణంలోని నాలుగో వార్డులో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేయాలని నిర్వాహకులకు వారు సూచించారు. నాయకులు గోపి, శ్రీనివాస్, శంకర్, సుధాకర్, శంకరయ్య పాల్గొన్నారు.

రేకులషెడ్ నిర్మాణ దాతకు సన్మానం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ ప్రాంగణంలోగల చిన్న అమ్మవారు దగ్గర రేకులషెడ్డును దాత నాయిని లింగారెడ్డి రూ. 60 వేల ఖర్చుతో నిర్మించారు. ఈసందర్భంగా ఆయనను శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, అర్చకులు శరత్‌చంద్రశర్మ, ప్రతినిధులు ఉన్నారు.

ఆదిబసవేశ్వర ఆలయ అన్నదాన ట్రస్ట్ ఏర్పాటు

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంలో ఆదిబసవేశ్వర ఆలయ అన్నదాన ట్రస్ట్‌ను శనివారం ఎన్నుకున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఆలయంలో అన్నదానం నిర్వహించనున్నారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడిగా సోమలింగ శివాచార్య మహారాజ్, అధ్యక్షుడిగా బందారి దిగంబర్, ప్రధాన కార్యదర్శిగా డెగ్లూర్ హన్మాండ్లు, సంయుక్త కార్యదర్శిగా దేవాల్ల హన్మాండ్లు, సహాయ కార్యదర్శిగా మడపతి సుభాష్, కోశాధికారిగా రవీందర్ ఆర్య, సభ్యులుగా బిరాదర్ రవి, నాగ్‌నాథ్ పటేల్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా కుషాల్, జంగం శ్రీనివాస్, రమేష్, జంగం అశోక్‌లను ఎన్నుకున్నారు.

తెయూలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌కే, ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో శ్రమదానం నిర్వహించారు. యూనివర్సిటీ పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నవీన్ కుమార్, దత్తాద్రి, సదాశివరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లింగం, నర్సారెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నస్రుల్లాబాద్: మండలంలోని పలు బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందు రెడ్డి అందజేశారు. మాజీ సర్పంచ్ అరిగె అంజయ్య, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన నాయకులు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్సై దీపక్‌కుమార్, ఏఎస్సై మధుసూదన్‌ను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, శ్రీకాంత్, సాయిరాం, రవీందర్‌నాయక్, నర్సింలు, వివేకానంద, రాములు, మల్లయ్య, పర్వయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తుక్కోజివాడిలో శనివారం స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సంస్థ కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, మగ్గం వర్క్, వంటి వాటిపై కూడా శిక్షణ ఇస్తామన్నారు. ఐకేపీ సీసీ రాములు, జీపీ కార్యదర్శి శ్రీనివాస్, అనురాధ, శిక్షకురాలు భానుప్రియ, టెక్నీషియన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద సీఐగా రవి కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వరంగల్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి సీఐ జగడం నరేష్ ఐజీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మోడెగాం, పద్మాజివాడి, మర్కల్ గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శనివారం పరామర్శించారు. కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. నాయకులు కమిలి నర్సింలు, పడిగెల రాజేశ్వర్ రావు, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, రాంరెడ్డి, గొడెల్లి గంగాధర్, మాచర్ల రాజులు, నాగాగౌడ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన రాయల శ్రీనివాస్ తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు నిరుపేద కావడంతో శనివారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు రవిపాటిల్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. వారి కుటుంబ పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

మంత్రి అడ్లూరి సన్మాన సభకు తరలిరావాలి

కామారెడ్డి అర్బన్: ఎస్సీ, ఎస్టీ మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఈనెల 26న హైదరాబాద్‌లో మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ తెలిపారు. సభకుల పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈమేరకు శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రం, స్వామి, చందు, భూపతి, స్వామి, శ్రీకాంత్, దేవేందర్ పాల్గొన్నారు.

27న మాలల ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడ రూరల్: బాన్సువాడలో ఈనెల 27న మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మాలసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్ తెలిపారు. ఈసమావేశానికి రాష్ట్ర ఉపాధి, కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని శనివారం బాసరలో కలిసి ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. నాయకులు మల్లూర్ సాయిలు, నర్సింలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండకు నేడు షబ్బీర్‌అలీ రాక

దోమకొండ: మండల కేంద్రంలో జరిగే బోనాల ఉత్సవాలకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ హాజరుకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయన ఆలయానికి వస్తారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా హోర్డింగ్



సదాశివనగర్ శివారులోని హైవే పక్కన విద్యుత్ వైర్ల మధ్యన ఏర్పాటు చేసిన హోర్డింగ్

సదాశివనగర్: మండలకేంద్రం శివారులోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ రైతు పొలం వద్ద ప్రయివేట్ కంపెనీకి చెందిన హోర్డింగ్ ప్రమాదకరంగా మారింది. హోర్డింగ్‌ను విద్యుత్ లైన్‌ల మధ్యన ఏర్పాటు చేయడంతో ఈదురు గాలులకు హోర్డింగ్ కదిలి వైర్లకు తగిలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరుగక ముందే వైర్ల మధ్య ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలోని పాత గ్రంథాలయం ముందున్న రోడ్డుపై నిత్యం డ్రెయినేజీ నీరు ప్రవహిస్తోంది. ప్రధాన రోడ్డు నుంచి గాంధీ చౌక్ వరకు మురికి నీరు ప్రవహిస్తూ దుర్వాసన కొడుతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బీర్కూర్‌లోని రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు

కళాశాలకు ప్రహరీ కరువు



దోమకొండలో ప్రహరీ లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రక్షణ లేకుండాపోయింది. కళాశాల ఆవరణలో పశువులు, ఆకతాయిలు, ఇతర రకాల బెడద ఎక్కువైపోయింది. కళాశాలలో నాటిన మొక్కలను పశువులు మేయడంతో వాటి సంచారాన్ని నిరోధించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు విషపురుగులు సంచరిస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు వెంటనే ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

27న అలయ్ బలయ్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 27న ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అలయ్ బలయ్ నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని వారు శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని ఆహ్వానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, వర్కింగ్ అధ్యక్షుడు బాల్‌రాజు, గౌరవ అధ్యక్షుడు చంద్ర, నాయకులు లక్ష్మిరాజం, రవి, రాంచంద్రం, రవితేజ ఉన్నారు.

సమాచారం..

బాన్సువాడ నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు

నస్రుల్లాబాద్(బాన్సువాడ)/బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణం నుంచి పలు పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు బాన్సువాడ డిపో మేనేజర్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ఉదయం 6గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బాన్సువాడ నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ యాత్రలో పర్లీ వైద్యనాథ్, అంబాజోగాయ్, పండరీపూర్ విఠలేశ్వర మందిరం, షోలాపూర్ తుల్జాభవానిమాతలను దర్శనం చేసుకోవచ్చన్నారు. అనంతరం బస్సు మరుసటి రోజు 21న సాయంత్రం 6గంటలకు బాన్సువాడ చేరుతుందన్నారు. ఈ ప్రయాణానికి పెద్దలకు రూ.2,200, పిల్లలకు రూ.1,100 టికెట్ ధర ఉందన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ప్రయాణించేవారు నంబర్ 9063408477ను సంప్రదించాలన్నారు.


ఆధ్యాత్మికం..

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి విగ్రహాన్ని జిల్లెడ ఆకులు, తమలపాకులు, పువ్వులు, చంద్రంతో అందంగా అలంకరించారు. హనుమాన్ పారాయణం, చాలీసా పఠించారు.

శాకంబరిగా రేణుకా ఎల్లమ్మ



భిక్కనూరు: ఆషాఢమాసం సందర్భంగా శనివారం భిక్కనూరు రేణుకా ఎల్లమ్మను భక్తులు శాకంబరిగా అలంకరించారు. హైదరాబాద్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్న భిక్కనూరుకు చెందిన మునిగళ్ల నాగరాజు గౌడ్ కుటుంబీకులు అమ్మవారి విగ్రహానికి కూరగాయలతో మాలలు తయారుచేసి అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు.

17నుంచి అఖండ హరినామ సప్తాహం



బాన్సువాడ రూరల్: నాందేవ్ మహారాజ్ పుణ్యతిథిని పురస్కరించుకుని ఈనెల 17నుంచి 23 వరకు మండల కేంద్రంలోని మేరుసంఘంలో అఖండ హరినామ సప్తాహ నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వేటూరి హనుమాండ్లు తెలిపారు. మేరుసంఘం భవనంలో శనివారం సప్తాహం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు భాస్కర్, సంఘ సభ్యులు మహేష్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు విరాళం అందజేత



దోమకొండ: మండల కేంద్రంలో ఆదివారం జరిగే మహంకాళి బోనాల పండుగకు మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్తగారి శిరీష్‌గౌడ్ శనివారం రూ.22 వేల విరాళంను ఆలయ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సిద్దారెడ్డికి అందజేశారు. ఆలయ కమిటీ డైరెక్టర్ నిమ్మ బాల్‌రాజ్ ఉన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి



ఎల్లారెడ్డిరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని ఉపాధిహామీ సిబ్బంది అన్నారు. మండలంలోని హాజీపూర్‌తండాలో శనివారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వారు మొక్కలను నాటారు. వనమహోత్సవంలో భాగంగా లక్ష్యానికి మించి మొక్కలను నాటనున్నట్లు సిబ్బంది తెలిపారు.



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పాపహరీశ్వర ఆలయ ఆవరణలో స్వాధ్యాయ పరిహార సభ్యులు మొక్కలు నాటారు. పాండురంగ శాస్త్రి కుమార్తె దీదీజీ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటినట్లు వారు తెలిపారు. పండరి, కిన్యూ సాట్, గంగాధర్ సాట్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఈద్గా పరిసరాల్లో శనివారం ముస్లింలు మొక్కలు నాటారు. వాహబ్, వహీద్ సిద్దీఖీ, అశ్ఫక్, నజీరొద్దీన్, చోటు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.